కలెక్టర్ ఎదుట చేతిరుమాలుతో గొంతుబిగించుకుంటున్న జగన్‌గౌడ్

బిల్లులు చెల్లించండి

- మాజీ సర్పంచ్ భర్త ఆత్మహత్యాయత్నం
- 'ప్రజావాణి'లో కరీంనగర్ కలెక్టర్ ఎదుటే ఘటన
- అడ్డుకున్న పోలీసులు
- ఆందోళనకు దిగిన మాజీ సర్పంచులు

కరీంనగర్ కలెక్టరేట్, జూలై 8 : 'అభివృద్ధి పనుల బిల్లులు చెల్లించడంలో అధికారులు జాప్యం చేస్తున్నరు. అప్పులు తెచ్చి పనులు చేస్తే వడ్డీ తడిసి మోపెడైనయి. మా ఆస్తులు అమ్మి చెల్లించినా మాకు మాత్రం బిల్లులు రావడం లేదు' అని ఆరోపిస్తూ కరీంనగర్ కలెక్టరేట్‌లో ప్రజావాణిలో ఓ మాజీ సర్పంచ్ భర్త ఆత్మహత్యకు యత్నించడం కలకలం సృష్టించింది. కలెక్టర్ పమేలా సత్పతి కళ్లెదుటే అతను తన జేబు రుమాలుతో గొంతు బిగించుకోవడంతో ఆమె ఒక్కసారిగా హతాశయురాలయ్యారు. వెంటనే గమనించిన పోలీసులు జేబు రుమాలు లాక్కొని మాజీ సర్పంచ్ భర్తను బయటకు లాక్కెళ్లారు. పూర్తి వివరాలిలా ఉన్నాయి.. రామడుగు మేజర్ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ పంజాల ప్రమీల భర్త జగన్‌గౌడ్ గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేపట్టగా, వీటికి సంబంధించి మొత్తం ₹65 లక్షలు బిల్లులు రావాల్సి ఉంది. వీటికి సంబంధించి ఎంబీ రికార్డులు కూడా పూర్తయ్యాయి. కాగా, విడుదల చేయాల్సిన మొత్తాన్ని కాంగ్రెస్ సర్కారు ప్రారంభించిన అమ్మ ఆదర్శ బడులకు కేటాయించినట్లు తెలిసింది. దీంతో బిల్లుల కోసం అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసి, విసిగి వేసారి పోయాడు. సోమవారం కరీంనగర్ కలెక్టరేట్‌లో ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశాడు. బిల్లులు చెల్లించడంలో అధికారుల నిర్లక్ష్యం తమకు శాపంగా మారిందని ఆవేదన చెందాడు. తన చేతిలో ఉన్న రుమాలుతో గొంతుకు బిగించుకుంటూ అరిచాడు. దీంతో ఎదురుగా ఉన్న అధికారులు బిత్తరపోయారు. గమనించిన పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని జగన్‌గౌడ్ నుంచి చేతి రుమాలు లాక్కుని, ఆయనను బయటకు తీసుకెళ్లారు. దీంతో ఆయనతో పాటు పెండింగ్ బిల్లులపై అర్జీలు అందజేసేందుకు వచ్చిన రామడుగు, గంగాధర మండలాలకు చెందిన పలువురు మాజీ సర్పంచులు ఆందోళనకు దిగారు. సముదాయించిన అధికారులు, పోలీసులు వారిని కూడా బయటకు పంపించారు.

మైనార్టీ ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ కలెక్టరేట్, జూలై 8 : స్రింగ్ సీజన్ 2024 సంవత్సరానికి ముఖ్యమంత్రి ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమాధికారి పవన్‌కుమార్ తెలిపారు. 2024 జనవరి 1 నుంచి జూలై 31 మధ్య కాలంలో విదేశాల్లోని విశ్వవిద్యాలయాల్లో పీజీ, పీహెచ్‌డీ చదువుకునేందుకు ప్రవేశాలు పొందిన విద్యార్థులు మాత్రమే పథకానికి అర్హులని పేర్కొన్నారు. విమాన టికెట్‌కు రూ.60వేలతో పాటు గరిష్ఠంగా రూ.20లక్షల వరకు ఉపకార వేతనం అందించనున్నట్లు స్పష్టం చేశారు. ఏడాదికి రూ.5లక్షల లోపు ఆదాయ పరిమితి ఉన్న విద్యార్థులు www.telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో ఆగస్టు 8 సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను కలెక్టరేట్ మొదటి అంతస్తులోని రూమ్‌నం. 108లోని మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

గీత దాటితే వేటే

- విధుల నిర్లక్ష్యం.. తప్పదు భారీ మూల్యం
- పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష మార్క్ పాలన
- నిత్య తనిఖీలతో ఉద్యోగులకు చుక్కలు
- బాధ్యతలు స్వీకరించిన 20రోజుల్లో పది మంది సస్పెన్షన్, సరెండర్
- ప్రజల కోసం ప్రతి రోజూ 2 గంటల టైం కేటాయింపు
- నేరుగా అర్జీల స్వీకరణ

పౌరసరఫరాల శాఖ గోదాం ఎంఎల్ఎస్ పాయింట్‌లో వివరాలను తెలుసుకుంటున్న కలెక్టర్

పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష తన మార్క్ పాలన చూపుతున్నారు. ప్రతి రోజూ ఉదయం 9గంటలకే కార్యాలయానికి వస్తూ, జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు చేస్తూ ఉద్యోగులకు దడ పుట్టిస్తున్నారు. నిశిత పరిశీలనలు, నిత్య సమీక్షలతో అధికారుల్లో జవాబుదారీతనాన్ని పెంచుతూనే, మరోవైపు విధుల్లో నిర్లక్ష్యం చేస్తున్నవారిపై కొరడా ఝుళిపిస్తున్నారు. వచ్చిన 20 రోజుల్లోనే పది మందిపై చర్యలకు ఉపక్రమించారు. కొందరిని సస్పెండ్ చేయడంతోపాటు మరికొందరిని ప్రభుత్వానికి సరెండర్ చేసి సంచలనం సృష్టించారు. అంతే కాదు ప్రతి రోజూ సాయంత్రం ప్రజలకు రెండు గంటలపాటు అందుబాటులో ఉంటూ, నేరుగా అర్జీలు స్వీకరిస్తూ భరోసా నింపుతున్నారు.

- పెద్దపల్లి, జూలై 8(నమస్తే తెలంగాణ)

పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాలనలో తనదైన ముద్ర వేసుకుంటున్నారు. కలెక్టర్‌గా గత జూన్ 16న బాధ్యతలు స్వీకరించిన శ్రీ హర్ష, 20 రోజుల్లోనే జిల్లాలోని మెజార్టీ ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించారు. కలెక్టరేట్‌లోని జిల్లా అధికారుల కార్యాలయాలు, స్కూల్స్, దవాఖానలు, అంగన్వాడీ కేంద్రాలు, మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాల్టీలు, తహసీల్దార్ కార్యాలయాలు, ఎంఎల్ఎస్ పాయింట్లను పరిశీలించారు. అధికారులతో సమీక్షించారు. వారిచ్చిన సలహాలు, సూచనలు స్వీకరిస్తూనే అధికారులుగా తామేం చేయాలో దిశా నిర్దేశం చేశారు. ఎక్కడికి వెళ్లినా అక్కడ నిషితంగా పరిశీలిస్తూ ఎవరు విధుల నిర్వహణలో నిర్లక్ష్యం చేసినా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటివరకు పది మంది అధికారులు, సిబ్బందిపై వేటు వేశారు. లీవ్ లేకుండా విధులకు గైర్హాజరైన జిల్లా భూగర్భజల గ్రౌండ్ వాటర్ అధికారి కే రవిశంకర్, ఆడిట్ కార్యాలయంలో విధులకు హాజరు కాని జిల్లా ఆడిట్ అధికారి ఎం సురేశ్ బాబును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. పెద్దపల్లి జిల్లా దవాఖానలో విధుల్లో నిర్లక్ష్యం చేసిన ఒక స్టాఫ్ నర్స్, మరో డాక్టర్‌ను సస్పెండ్ చేశారు. రామగుండంలో అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా చేపట్టిన పనులను పరిశీలించి, విధులను నిర్లక్ష్యం చేసిన మంథని ఆర్‌అండ్‌బీ జేఈ ఎండీ జావీద్‌ను సస్పెండ్ చేశారు. రామగుండం కార్పొరేషన్‌లో పనిచేస్తూ ఎలాంటి అనుమతి లేకుండా దీర్ఘకాలంగా విధులకు గైర్హాజరవుతున్న బిల్ కలెక్టర్ ఆర్ సతీష్‌ను, పారిశుధ్య పర్యవేక్షణ విధుల్లో నిర్లక్ష్యం చేసిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్‌ను ప్రభుత్వానికి సరెండర్ చేశారు. మంథని డీఎల్‌పీఓ ఏ శంకర్ సేవలు సంతృప్తికరంగా లేవని, ఆయనను రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్‌కు సరెండర్ చేశారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం చేసిన పెద్దపల్లి పౌరసరఫరాల శాఖ ఎంఎల్ఎస్ పాయింట్ గోదాం ఇన్‌చార్జిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. తన భూమికి తక్కువ కొలుతలు వేసి నష్టం చేశాడని ఓ రైతు ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేపట్టి కాల్వశ్రీరాంపూర్ సర్వేయర్ గణేశ్‌ను సస్పెండ్ చేశారు. గతంలో పనిచేసిన అధికారులకు భిన్నంగా ఎక్కడికక్కడే తక్షణ నిర్ణయాలతో యంత్రాంగాన్ని గాడిలో పెడుతూ పాలనలో మార్పు తీసుకొస్తున్నారు. అయితే, వరుస సస్పెన్షన్లతో జిల్లాలోని అధికారులు, సిబ్బంది అంతా అప్రమత్తమయ్యారు. సమయ పాలన పాటిస్తూ కార్యాలయాలకు చేరుకుంటున్నారు.

పకడ్బందీగా ప్రజావాణి

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహిస్తుండగా, జిల్లాలో పకడ్బందీగా అమలవుతున్నది. సాధారణంగా కార్యక్రమానికి జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరవుతుంటారు. కానీ, జిల్లాలో ఆ విధానానికి కలెక్టర్ స్వస్తిపలికారు. ఎక్కువగా అర్జీలు వచ్చే రెవెన్యూ, డీఆర్‌డీఓ శాఖల అధికారులు మాత్రమే ఉండాలని, మిగతా అధికారులంతా ఎక్కడివారు అక్కడ పని చేయాలని ఆదేశించారు. ఇంతకుముందు ప్రజావాణి ఉదయం 11గంటలైనా ప్రారంభమయ్యేది కాదు, కానీ శ్రీ హర్ష వచ్చాక ఉదయం 9గంటలకే ప్రారంభమవుతున్నది.

ఆర్టీసీలో పలువురు డీఎంల బదిలీ

కరీంనగర్ తెలంగాణచౌక్, జూలై 8: కరీంనగర్ రీజియన్‌లోని పలువురు డీఎంలను బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్ బస్టాండ్ ఏటీఎంగా పని చేస్తున్న రజినీకృష్ణ కరీంనగర్ లా ఆఫీసర్‌గా బదిలీ కాగా, ఆయన స్థానంలో వరంగల్ డిపో-2 మేనేజర్ సురేశ్ రానున్నారు. కోరుట్ల డీ ఎం విజయ మాధురి కరీంనగర్ -1 డీఎం గా బదిలీ కాగా, ఆ స్థానానికి సిరిసిల్ల డీఎం మనోహర్ వెళ్లనున్నారు. మెట్‌పల్లి డీఎం వేదవతి హైదరాబాద్ రీజియన్ ఫరూక్‌నగర్ డీఎంగా, మంథని డీఎం రాజశేఖర్ జేబీఎస్(సీఆర్ఎం)గా, కొత్తగూడెం ఏఈ మెకానిక్ వీఎస్ సుమార్ పదోన్నతిపై మం థని డీఎంగా, వేములవాడ డీఎం మనోహర్ గద్వాల డిపోకు, బస్‌భవన్‌లో విధు లు నిర్వర్తిస్తున్న శ్రీనివాస్ వేములవాడ డీ ఎంగా బదిలీ అయ్యారు. కరీంనగర్ కార్గో ఏటీఎం సదాశివ కరీంనగర్ వర్క్‌షాపు ఏఎంఈగా బదిలీ కాగా, ఇక్కడికి భద్రాచలం డీఎంగా పనిచేస్తున్న వీ రామారావు రానున్నారు. మంచిర్యాల డీఎం రవీంద్రనాథ్‌ను హుజూరాబాద్ డీఎంగా బదిలీ చేశారు.

ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ ఆర్సీవోగా అంజలి

కరీంనగర్ కమాన్ చౌరస్తా, జూలై 8 : మహాత్మా జ్యోతిబా పూలే బ్యాక్‌వర్డ్ క్లాసెస్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్ కరీంనగర్ రీజినల్ కోఆర్డినేటర్ (ఆర్సీవో)గా అంజలి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు ఇక్కడ విధులు నిర్వహించిన గౌతమ్‌రెడ్డి బదిలీపై హైదరాబాద్‌కు వెళ్లగా, ఆయన స్థానంలో ఆదిలాబాద్‌లో విధులు నిర్వర్తిస్తున్న అంజలి బాధ్యతలు తీసుకున్నారు.

ఇద్దరు జీపీ కార్యదర్శుల సస్పెన్షన్

రామడుగు, జూలై 8 : రామడుగు మండలం గోపాల్‌రావుపేట, దేశరాజ్‌పల్లి పంచాయతీ కార్యదర్శులు పాషా, సంతోష్‌ను సస్పెండ్ చేశారు. ఈ మేరకు కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి సోమవారం ఉత్తర్వులు జారీ చేసినట్టు రామడుగు ఎంపీడీవో రాజేశ్వరి తెలిపారు. ఇంటి నిర్మాణాల అనుమతుల్లో అవకతవకలు జరిగినట్టు అందిన ఫిర్యాదుల మేరకు ఇద్దరినీ సస్పెండ్ చేసినట్టు పేర్కొన్నారు. గోపాల్‌రావుపేట పంచాయతీ కార్యదర్శి గతంలోనూ సస్పెండ్ అయినట్టు అధికార వర్గాలు తెలిపాయి. మేజర్ గ్రామపంచాయతీ అయిన గోపాల్‌రావుపేటలో రూ.లక్షల్లో అవకతవకలు జరిగాయని, కాగా జిల్లా అధికారులు విచారణ చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మస్కట్ నుంచి వచ్చి.. భార్య ఉసురు తీసి

- అనుమానంతో చంపిన భర్త
- ఆపై ఆత్మహత్యాయత్నం
- దవాఖానకు తరలింపు
- మేడిపల్లి మండలం తొంబర్‌రావుపేటలో ఘటన

మేడిపల్లి, జూలై 8 : అనుమానమే పెనుభూతమైంది. మస్కట్ నుంచి వచ్చిన ఓ భర్త, వచ్చిన రోజే భార్య ఉసురు తీశాడు. ఆ తర్వాత తాను కూడా పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. పోలీసుల వివరాల ప్రకారం.. మేడిపల్లి మండలం తొంబర్‌రావుపేట గ్రామానికి చెందిన రాయంచు లింగం, లక్ష్మి అలియాస్ జల(45)కు కొడుకు అరుణ్, కూతురు అంజలి ఉన్నారు. లింగం బతుకు దెరువు కోసం సుమారు 20 ఏండ్ల నుంచి గల్ఫ్ దేశమైన మస్కట్‌కు వెళ్లి వస్తున్నాడు. భార్య లక్ష్మి అలియాస్ జల బీడీలు చుడుతూ, వ్యవసాయ పనులు చేస్తున్నది. రెండేండ్ల క్రితం కూతురు అంజలికి వివాహం చేశారు. కొడుకు అరుణ్ కూడా బతుకుదెరువు కోసం ఐదేళ్ల నుంచి దుబాయికి వెళ్తున్నాడు. కాగా, తాను ఇంటికి వస్తున్నట్టు ముందుగానే కుటుంబసభ్యులకు తెలిపిన లింగం, ఈ నెల 7న ఆదివారం సాయంత్రం 4 గంటలకు మస్కట్ నుంచి ఇంటికి వచ్చాడు.

రాయంచు లక్ష్మి (ఫైల్), రాయంచు లింగం

భర్త వచ్చిన కొద్ది సేపటి తర్వాత లక్ష్మి ఎప్పటి లాగే తోటి మహిళలతో కలిసి బీడీలు చుట్టేందుకు వెళ్లి, రాత్రి 10.30 గంటలకు ఇంటికి చేరుకున్నది. ఆ తర్వాత భార్యాభర్తలద్దిరికీ గొడవ జరిగింది. అప్పటికే వివాహేతర సంబంధం ఉందని అనుమానం పెంచుకున్న లింగం, సోమవారం ఉదయం 2 గంటల ప్రాంతంలో నిద్రించిన లక్ష్మిపై భార్య మెడకు తాడుతో ఉరేసి, పారతో తలపై బలంగా కొట్టడంతో లక్ష్మి అక్కడికక్కడే చనిపోయింది. తర్వాత లింగం మేడిపల్లి మండల శివారులో పురుగుల మందు తాగి పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు. విషయం తెలుసుకున్న లింగం సోదరుడు రాయంచు భీమయ్య అతడిని చికిత్స కోసం జగిత్యాల పట్టణంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించాడు. లక్ష్మి అక్క బింగిసారం విజయ సోమవారం ఉదయం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ శ్యామ్‌రాజ్ కేసు నమోదు చేశారు. కోరుట్ల ఇన్‌చార్జ్ సీఐ నిరంజన్‌రెడ్డి తొంబర్‌రావుపేటలో ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కోరుట్ల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. జగిత్యాల దవాఖానలో చికిత్స పొందుతున్న లింగం కోలుకున్న తర్వాత అరెస్ట్ చేస్తామని కోరుట్ల ఇన్‌చార్జ్ సీఐ తెలిపారు.

వాణిజ్య

భెల్, ఓడీఎఫ్‌లకు గ్రహణం

- కేంద్రం నుంచి ఆర్డర్లు కరువు
- ఇలాగే కొనసాగితే ఖాయిలానే అంటున్న కార్మిక సంఘాలు
- కేసీఆర్ చేయూతతో ఊరట
- కంపెనీల్లో కొత్త రిక్రూట్‌మెంట్ బంద్‌పెట్టిన బీజేపీ ప్రభుత్వం

ఆర్డినెన్స్ ఫ్యాక్టరీని కార్పొరేషన్‌గా మార్చిన మోదీ సర్కారు

ఆత్మనిర్భర్ భారత్ అంటూ గొప్పలకు పోయే మోదీ సర్కారు.. కీలక ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నది.

సంగారెడ్డి జిల్లాలో మూడు ప్రధాన ప్రభుత్వ రంగ సంస్థలున్నాయి. రక్షణ రంగానికి సంబంధించి ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ, బీడీఎల్ పరిశ్రమలుండగా.. వీటితోపాటు బీహెచ్ఎఈఎల్ ఉన్నదీ ఇక్కడే.

ఇందిరాగాంధీ ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు వీటిని స్థాపించారు. అయితే నరేంద్ర మోదీ ఆ పదవిలోకి వచ్చాక ఇవి నిర్వీర్యమైపోతున్నాయి. నష్టాలబాటపట్టి ఉద్యోగులు, కార్మికుల భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. అయినప్పటికీ గత పదేండ్లలో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్.. ప్రభుత్వం తరపున ఆర్డర్లిస్తూ ఆదుకున్నారు.

సంగారెడ్డి, జూలై 8 (నమస్తే తెలంగాణ): నరేంద్ర మోదీ దేశ ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రభుత్వ రంగ సంస్థలకు గ్రహణం పట్టుకున్నది. ప్రైవేటీకరణ పేరుతో సర్కారీ కంపెనీలు కుదేలయ్యాయి. తెలంగాణ విషయానికే వస్తే.. సంగారెడ్డి జిల్లాలోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ (ఓడీఎఫ్), భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్), భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్) పరిశ్రమలు అధోగతి పాలయ్యాయి. కేంద్ర ప్రభుత్వ చిన్నచూపుతో కొత్త ఆర్డర్లు లేక నష్టాల్లోకి జారుకున్నాయి. ఉద్యోగాలు లభించక యువత ఇబ్బందులు పడుతున్నది.

కార్పొరేషన్ పరిధిలోకి ఓడీఎఫ్

సంగారెడ్డి జిల్లా కంది మండలం ఇంద్రకరణ్ గ్రామ పరిధిలో ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉన్నది. గతంలో భారత ప్రభుత్వ రంగ సంస్థగా ఉండేది ఇది. క్షిపణులు, యుద్ధ ట్యాంకులు, మైన్ ప్రూఫ్-బుల్లెట్‌ప్రూఫ్ వాహనాలు తయారయ్యేవి. మిలటరీ అవసరాలకు కేంద్రం ఓడీఎఫ్‌కు వరుసగా ఆర్డర్లు ఇచ్చేది. అయితే మోదీ సర్కారు దీన్ని కార్పొరేషన్ పరిధిలోకి తీసుకువచ్చింది. ఆర్మ్‌డ్ వెహికిల్స్ నిగమ్ లిమిటెడ్ (ఏవీఎన్ఎల్)లోకి చేర్చారు. దీంతో ఆర్డర్లు తగ్గిపోయాయి. గతంలో ఓవర్ డ్యూటీలు చేసే కార్మికులు.. ఇప్పుడు పనిలేక ఉన్న కొలువులు ఎక్కడ ఊడిపోతాయోనన్న భయంతో బతికేయాల్సి వస్తున్నది. ఆర్డర్లు ఇవ్వాలని కేంద్రాన్ని కోరితే ఓపెన్ టెండర్లలో పాల్గొని తెచ్చుకోవాలంటూ సూచిస్తోంది. దీని వెనుక కంపెనీని ప్రైవేట్‌పరం చేయాలన్న కుట్ర ఉందన్న విమర్శలు వస్తున్నాయి. 3 వేల మంది కార్మికులు, వారి కుటుంబాల భవిష్యత్తు అంధకారంగా మారుతున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే జిల్లాలోని భానూరులో బీడీఎల్ పరిశ్రమ ఉన్నది. దీనికీ కేంద్ర ప్రభుత్వం మొండిచెయ్యే చూపిస్తున్నది. ప్రైవేటీకరించే దిశగా అడుగులు పడుతున్నాయి. దీన్ని వ్యతిరేకిస్తూ ఇటీవలే కార్మికులు ఆందోళన సైతం చేశారు.

భెల్‌కు ఆర్డర్లివ్వని కేంద్రం

సంగారెడ్డి జిల్లాలోని రామచంద్రాపురంలో బీహెచ్ఈఎల్ ఉన్నది. దీన్ని ప్రైవేట్‌పరం చేసే కుట్రను మోదీ ప్రభుత్వం పన్నుతోందని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 5 వేల మంది కార్మికులు భెల్‌లో పనిచేస్తున్నారు. ఈ పరిశ్రమలో గ్యాస్ టర్బైన్లు, ఆయిల్ రిగ్గులు, కంప్రెషర్లు, బాయిలర్లు, హీటర్లు, భారీ పంపులు తయారవుతాయి. మోదీ గద్దెనెక్కిన తర్వాత ప్రభుత్వ ఆర్డర్లు కరువయ్యాయి. వేలాది కోట్ల రూపాయల లాభాలను ఆర్జించిన బీహెచ్ఈఎల్.. నష్టాల బాటపట్టింది.

ఓడీఎఫ్‌లో తయారైన యుద్ధ ట్యాంకును సంగారెడ్డి జిల్లా కంది మండలం మల్కాపూర్ చెరువులో పరీక్షిస్తున్న ఇంజినీర్లు (ఫైల్) (ఇన్‌సెట్)సంగారెడ్డి జిల్లాలోని బీహెచ్ఈఎల్

కేసీఆర్ చొరవతో..

మూడేండ్ల క్రితం అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చేయూతనివ్వడంతో ప్రస్తుతం భెల్ లాభాలను ఆర్జిస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టుకు అవసరమైన పంపుల ఆర్డర్లను బీహెచ్ఈఎల్‌కే ఇచ్చారు. అలాగే తెలంగాణలో నూతనంగా నిర్మిస్తున్న విద్యుత్తు ప్రాజెక్టులకు సంబంధించి మిషనరీ ఆర్డర్ కూడా దక్కింది. బీహెచ్ఈఎల్ మనుగడకు నాటి సీఎం కేసీఆర్ నిర్ణయాలే కారణమని కార్మిక సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుతం మోదీ ఆత్మనిర్భర్ భారత్ అంటూ ప్రైవేట్ కంపెనీలకు పెద్ద పీట వేస్తున్నారని కార్మిక నాయకులు మండిపడుతున్నారు. ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వ రంగ సంస్థలు మూతబడేలా చేస్తున్నారని ధ్వజమెత్తుతున్నారు.

బెంజ్ ఎంట్రీలెవల్ ఈవీ కారు

ప్రారంభ ధర రూ.66 లక్షలు

న్యూఢిల్లీ, జూలై 8: లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెజ్-బెంజ్..తొలిసారి లగ్జరీ కార్లను కొనుగోలు చేసేవారి లక్ష్యంగా ఎలక్ట్రిక్ ఎంట్రీలెవల్ కారును అందుబాటులోకి తీసుకొచ్చింది. రెండు రకాల్లో లభించనున్న ఈ కారు ప్రారంభ ధర రూ.66 లక్షలు. వీటితో పాటు ఐదు సీట్ల ఈక్యూబీ 350 ఎస్‌యూవీ మాడల్ ధర రూ.77.5 లక్షలు, ఈక్యూబీ 250+(ఏడుగురు) రూ.70.90 లక్షల ధర కలిగిన మాడళ్లను కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ఏడాది చివర్లో ఈక్యూఎస్ మేబ్యాక్ ఎస్‌యూవీ, జీ-క్లాస్ మాడళ్లను సైతం ఈ ఏడాది చివర్లో ఈవీ విభాగంలో విడుదల చేయనున్నట్లు కంపెనీ ఎండీ, సీఈవో సంతోష్ అయ్యర్ తెలిపారు. వీటి ధర రూ.3 కోట్లు ఉండనున్నట్లు చెప్పారు.

హెచ్‌డీఎఫ్‌సీ రుణాలు ప్రియం

వడ్డీరేట్లను 10 బేసిస్ పాయింట్లు పెంచిన బ్యాంక్

హైదరాబాద్, జూలై 8: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మరోసారి వడ్డీరేట్లను పెంచింది. మార్జినల్ కాస్ట్ ఆఫ్ లెండింగ్ రేటు(ఎంసీఎల్ఆర్)ని 10 బేసిస్ పాయింట్లు పెంచడంతో రుణ గ్రహీతలపై అదనపు భారం పడనున్నది. దీంతో ఎంసీఎల్ఆర్ రేటు 9.05 శాతం నుంచి 9.40 శాతం మధ్యలోకి చేరింది. పెరిగిన రేట్లు సోమవారం నుంచి అమలులోకి వచ్చాయని పేర్కొంది. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో ఒక్కరోజు కాలపరిమితి రుణాలపై వడ్డీరేటుని 10 బేసిస్ పాయింట్లు పెంచడంతో వడ్డీరేటు 8.95 శాతం నుంచి 9.05 శాతానికి చేరుకున్నది. అలాగే నెల కాల పరిమితితో రుణాలపై వడ్డీ 9 శాతం నుంచి 9.10 శాతానికి పెరగగా..మూడు నెలల రుణాలపై వడ్డీరేటు 5 బేసిస్ పాయింట్లు సవరించడంతో రేటు 9.15 శాతం నుంచి 9.20 శాతానికి చేరుకున్నది. ఆరు నెలల రుణాలపై రేటు 9.30 శాతం నుంచి 9.35 శాతానికి చేరుకోగా, ఏడాది రుణాలపై రేటు 9.30 శాతం నుంచి 9.40 శాతానికి సవరించింది. రెండేండ్లు, మూడేండ్ల రుణాలపై రేటుని 9.40 శాతానికి సవరించింది బ్యాంక్. వీటితో పాటు బ్యాంక్ బెంచ్‌మార్క్ ప్రైమ్ లెండింగ్ రేటుని 17.90 శాతానికి, బేస్‌రేటుని 9.40 శాతానికి పెంచింది.

హైదరాబాద్‌లో సీ1 విస్తరణ

మరో 20 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నూతన ఆఫీస్

హైదరాబాద్, జూలై 8: అమెరికాకు చెందిన ఐటీ సేవల సంస్థ సీ1..హైదరాబాద్‌లో గ్లోబల్ ఇన్నోవేషన్ అండ్ కేపబిలిటీ సెంటర్(జీఐసీసీ)ని మరింత విస్తరించింది. గతేడాది 20 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన కార్యాలయానికి అదనంగా మరో 20 వేల చదరపు అడుగుల కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించింది. సత్వ నాలెడ్జ్ పార్క్‌లో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌లో 600 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని, ఈ సంఖ్యను మరింత పెంచుకునే అవకాశం ఉన్నదని కంపెనీ ఎండీ, కంట్రీ హెడ్ చంద్ర బొడ్డూజు తెలిపారు. అంతర్జాతీయంగా ఫార్చ్యూన్ 500 సంస్థల్లో సగం తమ క్లయింట్లను, వీటికి ఇక్కడి నుంచే సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. అలాగే పరిశోధన-అభివృద్ధి(ఆర్‌అండ్‌డీ)ని కూడా ఏర్పాటు చేసినట్లు, దీంట్లో ప్రస్తుతం 60 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది చివరినాటికి మొత్తం సిబ్బంది సంఖ్యను వెయ్యికి పెంచుకునే అవకాశాలున్నాయన్నారు.

ఆర్బీఐ సమీక్షకు టమాట సెగ

ముంబై, జూలై 8: మార్కెట్‌లో మళ్లీ పెరుగుతున్న టమాట ధరల సెగ.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ)కు తగులుతున్నది. తగ్గినట్టే తగ్గి తిరిగి పుంజుకున్న టమాట రేట్లు.. కిలో రూ.100కు చేరువయ్యాయి మరి. దీంతో ద్రవ్యోల్బణం అదుపే లక్ష్యంగా ద్రవ్యసమీక్షల్లో వడ్డీరేట్లను యథాతథంగా ఉంచుతున్న సెంట్రల్ బ్యాంక్.. ఇంకొన్నాళ్లు అలాగే ఉంచవచ్చన్న అంచనాలు ఇప్పుడు గట్టిగా వినిపిస్తున్నాయి. ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబైల్లో కిలో టమాట రూ.90 పలుకుతున్నది. కాగా, దేశీయంగా టమాట సాగులో కర్నాటక, ఏపీల వాటానే 35 శాతంగా ఉన్నది. తగ్గని ఉష్ణోగ్రతలు, కురువని వర్షాలు.. పంటకు ఆటంకంగా మారాయి. గత ఏడాది ఫిబ్రవరి నుంచి కీలక వడ్డీరేట్లు ఎక్కడివక్కడే ఉంటున్నాయి. ద్రవ్యోల్బణం దెబ్బకు వచ్చే నెల ద్రవ్యసమీక్షలోనూ అంతే ఉండొచ్చంటున్నారు.

పీఎస్బీల్లో వాటాల్ని అమ్మేయండి

ఇదే సరైన సమయం: ఎస్బీఐ నివేదిక • సర్కారీ బ్యాంకులు ఇంకా తగ్గాలి

న్యూఢిల్లీ, జూలై 8: ప్రభుత్వ రంగ బ్యాంకు (పీఎస్బీ)ల్లో వాటాల విక్రయానికి ఇదే సరైన సమయమని సర్కారీ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ సోమవారం తమ రిసెర్చ్ రిపోర్ట్‌లో పేర్కొన